నేరము శిక్ష

# డెత్ గేమ్...

## ఆదిత్య

**గోవా డోనాపాల్ బీచ్ దగ్గర పైలా పచ్చీస్ కుర్రకారంతా ఇసుకలో బీచ్ వాలీబాల్ ఆడుతున్నారు. ఎగిసిపడే అలలతో పోటీపడుతున్నట్లుగా కేరింతలు, తుళ్లింతలతో గంతులేస్తూ ఆడుతున్నారు అమ్మాయిలు, అబ్బాయిలు.**

అయితే వీటన్నింటికి దూరంగా ఒంటరిగా కూర్చుని వుంది అంకిత. అసహనంగా మధ్య మధ్య గడియారం చూసుకుంటున్న తీరు చూస్తుంటే తెలిసిపోతోంది అంకిత ఎవరికోసమో ఎదురు చూస్తోందని. కొంత సేపటికి వెనక వైపు నుంచి ఎవరో వచ్చి ఆమె కళ్లు మూసారు. అంకిత ఆ చేతులు తడుముతూ...

''యూ.. నాటీ అఖిల్...ఎప్పుడూ లేటేనా? క్లాస్ రూమ్‌కు ఎప్పుడూ లేటుగా వస్తావు. కనీసం ఇక్కడికైనా టైంకు రావాలని తెలీదా నీకు...?'' అంది నిష్టూరంగా.

ఆ మాటలు వింటూనే అంకిత కళ్ల మీది నుంచి చేతులు తీసి బిగ్గరగా నవ్వసాగాడు అతను.

ఒక్కసారిగా వెనక్కి తిరిగి చూసిన అంకిత ''ఏయ్... అక్షయ్ నువ్వా?...?'' అంది ఆశ్చర్యంగా.

''అవును నేనే... ఆ లేట్ మాస్టర్ రాడుగానీ.... నీకో మాట చెప్పాలి...'' అంటూ చొరవగా అంకిత పక్కన కూర్చున్నాడు అక్షయ్.

''ఏమిటి?'' అడిగింది అన్యమనస్కంగా ఎగిసి పడుతున్న అలల వైపు చూస్తూ...

''ఐ లవ్ యూ..''

ఆ మాట వింటూనే దూరంగా ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కడలి కెరటం వేగంగా తన మోహానికి తాకిన ఫీలింగ్ కలిగింది అంకితకు.

వెంటనే ఆమె ప్రమేయం లేకుండానే..

''వ్వాట్...నాన్‌సెన్స్... యూ ఆర్ టాకింగ్.... ఏదో ఫ్రెండువి కదా అని చనువుగా వుంటే ఇలా తలాతోక లేకుండా మాట్లాడతావా? నీకు పిచ్చి కానీ పట్టిందా?'' తూటాల్లాంటి మాటలు ఆమె నోటి నుంచి వెలువడ్డాయి.

అంకిత ఎరుపెక్కిన కళ్లు... ఆవేశంతో వణుకుతున్న పెదాలను చూస్తూనే ఉలిక్కిపడ్డాడు అక్షయ్.

ఎప్పటి నుంచో తన మనసులోని మాట చెప్పాలని ఎదురు చూసాడు. కానీ ఎప్పుడూ వీలు కాలేదు. అంకిత వెంట నీడలాగా ఎప్పుడూ అఖిల్ వుండేవాడు. ఈరోజు అఖిల్ అక్కడ లేకపోవడంతో ఇలా తన మనసులో మాట బయటపెట్టాడు అక్షయ్. కానీ కథ ఇలా అడ్డం తిరుగుతుందని అనుకోలేదు. ఇంతలో దూరంగా అఖిల్ రావడం కనిపించగానే వెంటనే అక్షయ్ బిగ్గరగా నవ్వసాగాడు. అఖిల్ దగ్గరకు రాగానే....

''హాయ్...అఖిల్...అంకిత చూడు ఎలా ఫూలయ్యిందో? ఐ లవ్ యూ అనగానే నిజం అనుకొని ఎలా ఉడుక్కుంటుందో చూడు. ఆమె మొహం చూడు ఎలా కందగడ్డలా కంది పోయిందో'' అంటూ పొట్ట చేత పట్టుకొని పడి పడీ నవ్వసాగాడు.

విషయం ఏమిటో తెలియని అఖిల్ విస్మయంగా నిల్చున్నాడు. అనిత కూడా అక్షయ్ వైపు ఆశ్చర్యంగా చూడసాగింది.

''ఇద్దరూ వినండి... ఈరోజు డేట్ ఏమిటి?''

''ఒకటో తారీకు'' కోరస్‌గా అన్నారు అంకిత, అఖిల్‌లు.

''అదే ఏ నెల ఒకటో తారీకు?'' మళ్లీ రెట్టించి అడిగాడు అక్షయ్.

''ఏప్రిల్ ఒకటి'' అని ఏదో గుర్తుకొచ్చిన అంకిత 'అంటే ఫూల్స్ డే...యూ నాటీ...నన్నే ఫూల్ చేస్తావా?' అంటూ అక్షయ్‌ని పట్టుకొని కొట్టడానికి ముందు కురికింది.

అక్షయ్ ఆమెకు దొరక్కుండా పరిగెత్తాడు. ఇద్దరినీ చూస్తూ నవ్వుకున్నాడు అఖిల్. అక్కడ అంత వరకూ వున్న సీరియస్‌నెస్ పోయి నవ్వుల పూలు పూసాయి.

* * *

రిమ్‌జిమ్ రెస్టారెంట్‌లో ఎదురెదురుగా కూర్చుని వున్నారు అంకిత, అఖిల్‌లు. 'ఇంతకీ ఏమంటారు మీ నాన్నగారు, అమ్మగారు?' అడిగింది అంకిత.

ఏం మాట్లాడకుండా మౌనంగా వుండిపోయాడు అఖిల్.

''ఏమిటి సీరియస్‌గా వున్నావు? ఎనీ ప్రాబ్లం? మన పెళ్లికి ఏదన్నా అభ్యంతరమా?'' ఆందోళనగా అడిగింది అంకిత.

''మా అమ్మగారు కొంత మెత్తబడ్డారు గానీ, మా నాన్నగారే బెట్టు చేస్తున్నారు.''

అంతవరకూ ఎంతో ఉత్సాహంగా వున్న అంకిత మొహంలో విచారం చోటు చేసుకుంది. నిరాశగా, 'ఒకే అఖిల్ ఇక నన్ను మర్చిపో....' అంకిత మాట పూర్తి అవనే లేదు..

''ఊపిరి తీయడమైనా మరిచిపోతాను కానీ...నిన్ను మరవడం నా వల్ల కాదు. నీకోసం ప్రాణాలైనా అర్పిస్తా.....''

వీళ్లిద్దరి సంభాషణ ఇలా సాగుతుండగానే అక్షయ్ అక్కడకు చేరుకున్నాడు. 'హాయ్ గైస్ ఏమిటీ హ్యాపీగా వుండాల్సిన మీ మొహాలేమిటి? అలా వాడిపోయిన బల్బుల్లాగా వున్నాయి?' అంటూ పలకరించాడు.

''అక్షయ్ నీకెప్పుడూ నవ్వులాటే. బీ సీరియస్. మాకేమో ప్రాణంతక సమస్య తెలుసా?'' అన్నాడు అఖిల్.

''ఓ సారీ బాబూ... ప్రేమికులకు ప్రేమ పరీక్షలాగుంది. మీరెలాగైనా ఈ పరీక్షలో నెగ్గాలని ఈ స్నేహితుడి ప్రగాఢ కోరిక.''అన్నాడు అక్షయ్ నాటకఫక్కీలో.

''ఇంతకీ ప్రాబ్లం ఏమిటి?''

''ఏముంది? అఖిల్ వాళ్ల నాన్నగారికి తను నన్ను పెళ్లి చేసుకోవడం నచ్చలేదట'' చెప్పింది అంకిత.

''అయితే సీరియస్ మ్యాటరే? అఖిల్ ఓ సంగతి చెప్పు. మీ పేరెంట్స్ నిన్నెంతలా ప్రేమిస్తారు.'' ప్రశ్నించాడు అక్షయ్.

''అదేం ప్రశ్న? మా వాళ్లు నన్ను ప్రాణం కన్నా మిన్నగా ప్రేమిస్తారు''

''నీ ప్రాణానికేదైనా ప్రమాదం ఏర్పడిందనుకో ఏం చేస్తారు?''

''తల్లడిల్లిపోతారు... నాకోసం ఏం చేయడానికైనా సిద్ధపడతారు.''

''ఆ వీక్‌నెస్ మీదే ఇప్పుడు మనమో గేమ్ ప్లే చేయాలి'' అన్నాడు అక్షయ్.

''ఏమిటా గేమ్?'' అఖిల్, అంకితలు ఇద్దరూ ఒక్కసారిగా అడిగారు.

''అయితే చెబుతా వినండి..''

ఇద్దరూ ఆసక్తిగా ముందుకు జరిగారు. ఓ అయిదు నిమిషాలు అక్షయ్ చెప్పిందంతా శ్రద్ధగా విన్నారు ఇద్దరూ.

అతను చెప్పిందంతా విన్న తరువాత

''ఇందులో రిస్కేమీ లేదుగా.''

''ప్రేమ పరీక్షలో ఆమాత్రం కష్టపడాలి బాబూ... ఈ గేమ్‌కు ఓ పేరు పెడతా'' అన్నాడు అక్షయ్.


''ఏమిటా పేరు?''

''డెత్ గేమ్''

ఆ మాట వినగానే ముగ్గురూ నవ్వుకున్నారు.

* * *

కారులో కూర్చుని అంకిత అసహనంగా ఓ ఫోన్ కాల్‌కి ఎదురు చూస్తోంది. సరిగ్గా తొమ్మిది గంటలకు అంకిత సెల్ మోగింది. 'హలో అంకితా! నేను అక్షయ్‌ని. అఖిల్ పేరెంట్స్ వచ్చేస్తున్నారు. వాళ్ల కారు ఇప్పుడే మలుపు తిరిగింది' అంటూ చెప్పాడు.



graphic illustration: akbar

ఆ వెంటనే అంకిత అఖిల్‌కు ఫోన్ చేసి, 'అఖిల్ మీ వాళ్లొచ్చేస్తున్నారు...గెట్ రెడీ' అని మెసేజ్ పంపింది.

అఖిల్ పేరెంట్స్ గజానంద్, సురేఖలు ఇంటి ఆవరణలోకి ప్రవేశించి కారు పార్క్ చేస్తుంటే వినిపించిందో మృత్యుఘోష. వాళ్లు ఒక్క అంగలో మెయిన్ డోర్ చేరుకొని తలుపు తట్టారు. తలుపు తెరుచుకోలేదు. లోపలి వైపు గడియ వేసుంది. తలుపులు దబదబా బాదారు తెరుచుకోలేదు. లోపల్నుంచి 'అమ్మా...నాన్నా...రక్షించండి' అన్న అఖిల్ కేకలు వినిపిస్తున్నాయి. ఈ హడావుడికి ఇరుగుపొరుగులు అక్కడకు చేరుకున్నారు. అందరూ కలిసి తలుపులు బాదారు. భళ్లున తలుపు తెరుచుకుంది గానీ...

అఖిల్ గొంతు మూగబోయింది. హడావుడిగా అందరూ అక్కడకు చేరుకొని చూసేసరికి అఖిల్ బాడీ హాల్లోని సీలింగ్‌కి వేళ్లాడుతూ కనిపించింది.

అఖిల్ ఉరేసుకున్నాడు.

నిమిషాల్లో అక్కడి దృశ్యం మారిపోయింది. పంజిం ఎస్ఐ మధుకర్ అక్కడకు చేరుకున్నాడు. విషయం తెలిసిన అంకిత, అక్షయ్ హడావుడిగా అక్కడకు వచ్చారు. అఖిల్ శవాన్ని చూస్తూనే ఘొల్లుమని ఏడవసాగింది అంకిత. అక్షయ్ కూడా దుఃఖసాగరంలో మునిగిపోయాడు. అఖిల్ చేతిలో ఓ కాగితం కనిపించింది.

''నా చావుకు ఎవరూ కారణం కాదు. నా చావుకు నేనే బాధ్యుడ్ని'' అని రాసి వుంది.

ఆ కాగితం చూస్తూనే....

''నో.... అఖిల్ ప్రాణాలు తీసుకునే పిరికి వాడు కాదు. దీనికంతా మేమే కారణం..'' అంటూ అరిచింది. ఆమె ఏం మాట్లాడుతోందో అక్కడున్న వాళ్లెవ్వరికీ అర్థం కాలేదు. ఆమె ఏదో చెప్పబోతోందని గ్రహించిన ఎస్ఐ మధుకర్ 'మిస్ ఏదన్నా చెప్పదలచుకుంటే నా వెంట పోలీస్ స్టేషన్‌కు రండి' అని శవాన్ని పోస్టుమార్టంకు సివిల్ హాస్పిటల్‌కు పంపించాడు.

* * *

ఎస్ఐ మధుకర్ తన ఎదురుగా కూర్చున్న అంకిత, అక్షయ్‌లను చూస్తూ....''ఇప్పుడు చెప్పండి? మీరేదో చెప్పాలనుకుంటున్నారు....'' అంటూ అడిగాడు.

అంకిత దుఃఖంతో మాట్లాడలేకపోయింది.

అక్షయ్ గొంతు సవరించుకొని చెప్పసాగాడు. 'అఖిల్, అంకిత ఇద్దరూ ప్రేమికులు. అయితే వీళ్లిద్దరి పెళ్లికి అఖిల్ ఇంట్లో అభ్యంతరాలు చెబుతున్నారు. అయితే ఇంట్లో వాళ్ల అంగీకారం పొందడానికి ఓ చిన్న నాటకం ఆడాం....'

''ఏమిటా నాటకం?''

''అది... అది... డెత్ గేమ్''

''డెత్ గేమా? అదేంటి?''

''అఖిల్‌ను ఉరివేసుకున్నట్లుగా నటించమన్నాం. సరిగ్గా వాళ్ల పేరెంట్స్ వచ్చే సమయానికి అతను ఉరివేసుకోవాలని, పేరెంట్స్ ఆ దృశ్యం చూసి గుండె చేజారిపోయి వెంటనే పెళ్లికి అంగీకరిస్తారని భావించాం...''

అంకిత కళ్లు తుడుచుకొని 'ఆ దిక్కుమాలిన నాటకమే అఖిల్ ప్రాణాలు తీసింది.'

''అంటే, మీరు ఆడిన దిక్కుమాలిన నాటకం ఓ నిండు ప్రాణం తీసింది...' ధుమ ధుమలాడాడు ఎస్ఐ మధుకర్.

''అవునూ... అంతా బాగానే వుంది కానీ, లోపల గడియ ఎందుకు పెట్టుకున్నట్లు?'' అడిగాడు ఎస్ఐ.

''అదే, నాకు అర్థం కావడం లేదు....'' అన్నాడు అక్షయ్.

''సరే, మీరు వెళ్లండి మళ్లీ అవసరమయినప్పుడు పిలుస్తా.'' అని వాళ్లను పంపించాడు. వాళ్లు వెళ్లగానే, వెంటనే తన అసిస్టెంటు డిసౌజాను పిలిచి వాళ్లను విడివిడిగా అబ్జర్వ్ చెయ్యమని చెప్పాడు.

* * *

మరునాడు ఎస్ఐ మధుకర్ డిసౌజా చెప్పిన వివరాలన్నీ శ్రద్ధగా విన్నాడు. నేరుగా అంకిత ఇంటికి వెళ్లాడు.

''అసలు మీకు ఈ ఐడియా ఇచ్చిందెవరు?'' మళ్లీ అడిగాడు మధుకర్.

అక్షయ్ ఈ ఐడియా ఇచ్చాడు.

''నీకు ఎవరి మీదన్నా అనుమానంగా వుందా?''

''లేదు...''

''అవునూ, ఆ సమయంలో అక్షయ్ ఎక్కడున్నాడు?''

''అఖిల్ ఇంటికి కొద్ది దూరంలో ఓ వీధి మలుపు దగ్గర అక్షయ్ వున్నాడు. రెండో మలుపు దగ్గర నేనున్నాను.''

''అక్షయ్ ఆ సమయంలో అక్కడే ఉన్నాడని నీకు ఖచ్చితమైన నమ్మకమా?''

''లేదు, ఆ సమయంలో నాతో సెల్‌లో మాట్లాడాడు. అయినా ఎందుకలా అడుగుతున్నారు?''

''రేపోసారి స్టేషనుకు వస్తే అన్నీ వివరంగా చెప్తా'' అంటూ వెళ్లిపోయాడు ఎస్ఐ.

* * *

మరునాడు పంజిం పోలీస్ స్టేషన్‌లో అందరూ సమావేశమయ్యారు.

''సార్ అఖిల్ ప్రాణాలు తీసిన హంతకుడు దొరికనట్టేనా?'' ఆవేశంగా అడిగాడు అక్షయ్.

అంకిత, అఖిల్ తల్లిదండ్రులు ఎస్ఐ మధుకర్ ఏం చెబుతాడా? అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

''అక్షయ్ మరీ అంతలా ఆవేశపడకు. ఈ అనర్థాలన్నింటికి మూలం నువ్వే. అంకిత మీద మనసు పడ్డ నీవు ఆమె తిరస్కరించగానే ప్లేటు మార్చావు. వాళ్లతో స్నేహం నటిస్తూనే అంకిత నీకు దక్కలేదన్న కసితో అఖిల్‌ను అంతమొందించడానికి కుట్రపన్నావు. అందులో భాగంగానే డెత్‌గేమ్ ప్లాన్ సూచించావు. అమాయకంగా అఖిల్ మెడకు ఉరితాడు బిగించుకున్నాడు. నువ్వు అదే ఇంట్లో దాక్కున్నావు. గేటు బయట కారు చప్పుడవగానే మెయిన్ డోర్‌కు గొళ్లెం పెట్టి బాల్కనీలో నుంచి పారిపోయాడు. మెయిన్ డోర్ గడియ మీద, బాల్కనీలోని గాజు కిటికీ మీద నీ వేలి ముద్రలున్నాయి'' అని ఎస్ఐ చెప్పగానే..

''ఇదంతా అబద్ధం, కట్టుకథ'' అంటూ అరవసాగాడు అక్షయ్.

''సరే... ఓసారి అటు చూడు అంటూ పక్కకు జరిగాడు మధుకర్. ఆయన వెనకనున్న డిసౌజాను చూడగానే ఉలిక్కిపడ్డాడు అక్షయ్.

''నిన్న రాత్రి బార్‌లో నీ పక్కనే కూర్చున్నాడు డిసౌజా. పీకల దాకా తాగి సంతోషంతో సెలబ్రేట్ చేసుకుంటున్నావు . డిసౌజాకు కూడా డ్రింక్ ఆఫర్ చేసావు. నీతో మాట కలిపి నీ సంతోషానికి కారణం అడిగాడు. అఖిల్ కన్నుమూయడంతో అంకిత నీ సొంతమవుతుందన్న సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యావు. మఫ్టీలో వున్న డిసౌజా నీ మాటలు రికార్డ్ చేసాడు. ఈ సాక్ష్యం చాలా?''అనేసరికి తలొంచుకున్నాడు. విషయం అంతా విన్న అంకిత క్రోధంతో 'మిత్రద్రోహి' అని అక్షయ్ చెంప పగలకొట్టింది.

అక్షయ్‌ని అరెస్ట్ చేసారు.

కేసు విచారణలో వుంది.

★

## ఆక్టోపస్ జెలసీ

**తన లవర్ జోలికొస్తే మగ ఆక్టోపస్‌లు అస్సలు ఊరుకోవట. కాలిఫోర్నియాకు చెందిన మెరైన్ బయాలజిస్టులు అంటున్నారు. ఇండోనేషియా దగ్గర సముద్రాంతర్భాగంలో కొన్ని వారాలపాటు ఆక్టోపస్‌లపై జరిపిన పరిశోధనల్లో ఇది వెల్లడైంది. 'ఆక్టోపస్ అక్యులీటస్' జాతికి చెందిన మగ ఆక్టోపస్‌కు ఈర్ష్య అమితంగా ఉంటుందట. నారింజ పండు పరిమాణంలో ఉండే ఈ ఆక్టోపస్ జత కట్టే సమయంలో చాలా శ్రమించి తమ తోడును ఎన్నుకుంటుంది. ఒకసారి ఎన్నుకున్నాక ఇక ఒక్క క్షణం కూడా తన తోడును విడిచి వుండదు. నిరంతరం కూడా తిరుగుతూంటుంది. ఒకవేళ మరో ఆక్టోపస్ పొరబాట్న అటువేపొచ్చిందా - 20 నుండి 25 సెంటీమీటర్ల పొడవుండే తన టెంటకిల్స్‌తో దాని పీక పిసికి చంపేస్తుంది. అంతే కాదు ఈ జాతి ఆక్టోపస్ కామరూపి కూడానట. ఇది సాధారణంగా మగ ఆక్టోపస్‌లకు మాత్రమే వంటిపై వుండే బొడిపెలను చర్మంలోపలికి లాక్కుని ఆడ ఆక్టోపస్‌లా తోటి ఆక్టోపస్‌లను భ్రమింపజేస్తుంది.**

